క్లుప్తంగా

పేద కుటుంబానికి చేయూత



సరుకులు, బియ్యం అందిస్తున్న సంఘం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : అంపోలు గ్రామానికి చెందిన ఉట్ల హేమంత్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో పనికి వెళ్లలేక కుటుంబ పోషణకు ఇబ్బందిపడుతున్నారు. విషయం తెలుసుకున్న నగరానికి చెందిన మాతృభూమి సేవా సంఘం సభ్యులు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ప్రతాప్, కోశాధికారి లక్ష్మణ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

జి.సిగడాం: గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఓలు, సచివాలయం సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా తమ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని తహసీల్దార్ మహాదేవు సరిత సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు నేపథ్యంలో అంటురోగాలు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

ఉమా జలలేశ్వరునికి నక్షత్ర పూజలు



అలంకరణలో ఉమాజలలేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజలలేశ్వర స్వామికి జన్మనక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అలంకరణ సేవ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భద్రమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: బలగలోని భద్రమ్మ తల్లి ఆలయంలో వారాలు సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముర్రాట్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


బస్సు సర్వీసులు పెంచాలి



పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం : స్త్రీ శక్తి పథకం చాలా గ్రామాలకు చేరడం లేదని, మహిళలంతా వినియోగించుకునేలా బస్సు సర్వీసులు పెంచాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. దవళపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ప్రైవేటు వాహనాల్లో కిక్కిరిసి ప్రయాణం సాగించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సర్వీసులు పెంచడంతో పాటు అన్ని బస్సుల్లోనూ ప్రయాణానికి అవకాశం కల్పించాలని కోరారు.

పాలన ధర్మబద్ధంగా ఉండాలి



ప్రసంగిస్తున్న స్వామి చిద్రూపానంద సరస్వతి

శ్రీకాకుళం కల్చరల్ : పాలకులు ధర్మబద్ధంగా పరిపాలన చేయాలని ఢిల్లీ చిన్మయ మిషన్, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు స్వామి చిద్రూపానంద సరస్వతి అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో చిన్మయ మిషన్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో మహాభారతంలోని శాంతి పర్వంపై రెండో రోజు మంగళవారం ఉపన్యాసం జరిగింది. ఆపద్ధర్మం, మోక్షధర్మం, రాజధర్మంపై వివరించారు. ప్రతిఒక్కరూ సత్వగుణం కలిగి ఉండాలన్నారు. శ్రీకృష్ణుడి ఉపదేశించిన సందేశాలు వింటే జీవిత గమ్యం ఏంటో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్వామి పరాత్మానంద సరస్వతి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, అంధవరపు ప్రసాద్, నిష్టల నరసింహమూర్తి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా గౌరవం?

- ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనాలు
- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానం లేక డమ్మీలుగా మార్చేసిన వైనం
- మంజూరు కాని అభివృద్ధి నిధులు



గార మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు(ఫైల్)

గార : కూటమి ప్రభుత్వంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివక్షకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన తర్వాత ఈ సర్కారు హయాంలోనే రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రాదేశిక సభ్యులను డమ్మీలుగా మార్చేస్తున్నారు. 1985లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ వ్యవస్థను ప్రవేశపెట్టింది. పరిపాలన సజావుగా సాగడంతో పాటు నిధులు కేటాయింపులు సక్రమంగా జరిగేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎంపీటీసీ సభ్యుల పాత్ర నామమాత్రంగా మారిపోయింది. నిధులు రాక, పనులు కాక సతమతమవుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం ఆహ్వానించకపోవడంతో గౌరవ వేతనాన్ని కూడా ఇవ్వడం లేదు.

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం..

ఎంపీటీసీలకు అభివృద్ధి నిధులు కేటాయింపులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి మందగించింది. పనులు చేయలేక ముఖం చాటేసుకున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం జిల్లా పరిషత్‌కు కేటాయించేవారు. వీటితో గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎంపీటీసీ సభ్యులు చేయించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. 14వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీలకే కేటాయించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి వచ్చింది.

24 నెలలుగా అందని వేతనాలు..

గార మండలంలో 23 ఎంపీటీసీ స్థానాలకు గాను వ్యక్తిగత కారణాలతో ఇద్దరు ఎంపీటీసీలు రాజీనామా చేయగా, ఇరవై ఒక్క మంది కొనసాగుతున్నారు. వీరికి ప్రతి నెలా రూ.మూడు వేలు గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో మూడో విడత నిధులు మంజూరు చేసే అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఎంపీటీసీ వ్యవస్థపై దృష్టిసారించడం లేదని విమర్శిస్తున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన తమను కాదని.. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో టీడీపీ కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వడంపై మండిపడుతున్నారు. అధిక శాతం ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీకి చెందిన వారే కావడంతో రాజకీయ కోణంతోనే తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులేవీ?



ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేక నిధులు లేకపోవడంతో అభివృద్ధిలో భాగస్వామ్యం కాలేకపోతున్నాం. ప్రజలు కోరిన చిన్నపాటి అభివృద్ధి పనులకు అవకాశం లేకుండా పోతోంది. గ్రామంలో చిన్నపాటి సమస్య పరిష్కారానికి కూడా నిధులు ఉండాలి. గౌరవ వేతనాలు సైతం ఇవ్వడం లేదు. స్థానిక సంస్థలు బలోపేతమైతేనే గ్రామ స్వరాజ్యం ఏర్పడుతుంది.

– అంధవరపు రామలక్ష్మి, వైస్ ఎంపీపీ, శ్రీకూర్మం

వివక్ష తగదు..



ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే సమయంలో టీడీపీ కార్యకర్తలకు ఇస్తున్న విలువ ఎంపీటీసీ సభ్యులకు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు. అధికారులు కూడా టీడీపీ నేతలకే ప్రాధాన్యమివ్వడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు కూడా నిలిపివేయడంతో గ్రామ సమస్యలు పరిష్కరించలేకపోతున్నాం.

– ఆరంగి రమణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు, గార

దళితులకు అన్యాయం జరిగితే సహించం



మేరుగ నాగార్జునకు అంబేడ్కర్ విగ్రహాన్ని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా సహించేది లేదని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. దళిత ఉద్యోగి సౌమ్యను పరామర్శించేందుకు మంగళవారం జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా నాగార్జునకు మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కళింగ వైశ్య కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు అంబేడ్కర్ విగ్రహాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ముందుకెళ్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ గెలుపుకోసం దళితులందరినీ ఏకతాటిపైకి తీసుకొస్తామన్నారు. కూటమి నేతల నుంచి దళితులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది జరిగినా బాధితులకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైఎస్సార్ సీపీ తూర్పు కాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, పోలినాటి వెలమ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షుడు పొన్నాడ రుషి, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు సృజనాత్మకత అవసరం



లూయిస్ డాగురె మండేలా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సంఘం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : ఫొటోగ్రాఫర్లు సృజనాత్మకంగా ఆలోచిస్తూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే వృత్తిలో రాణించగలమని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు అన్నారు. నగరంలోని నటరాజ్ ఫొటో ఎంపోరియంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా లూయిస్ డాగురె మండేలా విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఫొటోగ్రఫీకి ఎనలేని సేవ చేసిన వ్యక్తిగా డాగురె చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు పక్కి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సింధు శ్రీను, మహావీర్ వెంకటేష్, రవి, శ్రీరామూర్తి, యుగంధర్, వెంకట్, చిరంజీవి, సురేష్, భానుమూర్తి, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



పెద్దగనగళ్లవానిపేటలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్ : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ టి.చిరంజీవినాయుడు, బి.నమ్రత ప్రియ అన్నారు. బుధవారం పెద్దగనగళ్లవానిపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు మాట్లాడుతూ ఎల్లప్పుడూ చేతులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాలు కారణంగా తాగునీరు కలుషితమై టైఫాయిడ్, కామెర్లు, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సోనియా, ఏఎన్‌ఎం రోజా, సచివాలయ కార్యదర్శి వెంకటరమణ, ఆశలు వరలక్ష్మి, వసుమతి తదితరులు పాల్గొన్నారు.

గారలో విస్తృత తనిఖీలు



నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపడుతున్న దృశ్యం

గార: మండల కేంద్రం గారలో పలు దుకాణాలు, ఖాళీ ప్రదేశాల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టారు. తూలుగు జంక్షన్‌లో సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్, మహిళల రక్షణ వంటి అంశాలను ఎస్‌ఐ సీహెచ్.గంగరాజు తెలియజేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక నేడు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్‌మాధవ్ బుధవారం జిల్లాకు రానున్నారు. రాష్ట్ర అధ్యక్షుని బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీకాకుళం మొదటిసారిగా వస్తుండటంతో ఘనస్వాగతం పలికేందుకు ఆ పార్టీ శ్రేణులు సమాయత్తమౌతున్నారు. ర్యాలీ అనంతరం సన్ రైజ్ హోటల్‌లో బీజేపీకి చెందిన జిల్లా నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు.

విజయగణపతికి విశేష అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

తుప్పల్లో ప్రభుత్వ భవనాలు



కూటమి పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భవనాలకు గ్రహణం పట్టింది. జే.ఆర్.పురం–2లో రైతు సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్యం కేంద్రం, పాల వెల్లువ భవనాలు తుప్పల్లో మగ్గిపోతున్నాయి. నిర్వహణ గాలికొదిలేయడంతో భవనాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

– రణస్థలం

మహా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం





నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో శివబాలాజీ ఆలయ నిర్మాణం జరిగి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏకోత్తర సహస్ర కలశ స్నపన పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ వేంకటేశ్వరుడు, ఉమా సమేత అమరనాథేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ, విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, పరిషత్, యాగశాల ప్రతిష్ట, పతాక ప్రతిష్ట, అగ్నిమథనం, అగిప్రతిష్ట, ధ్వజారోహణం, విశేష హోమాలు జరిగిగాయి. కార్యక్రమంలో ఆలయ సేవా సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి

ఎచ్చెర్ల : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం పొన్నాడ కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గోతుల రహదారితో ఇక్కట్లు



బొంతుపేట - రావాడ రహదారి దుస్థితి

రణస్థలం : లావేరు మండలం బొంతుపేట జాతీయ రహదారి నుంచి రణస్థలం మండలం రావాడ వరకు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. పిన్నింటిపేట, బుడతవలస, మెట్టవలస, గుమ్మడాం, ఎస్.ఎస్.పురం, వాళ్లెపేట, నీలాపురం గ్రామాలను కలిపే ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడినా అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో సిక్కోలు జోరు



పతకాలు సాధించిన క్రీడాకారిణిలతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, మధు, కోచ్ అప్పన్న

శ్రీకాకుళం న్యూకాలనీ : ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు సత్తాచాటారు. విజయనగరం జిల్లా కొండవెలగడ వేదికగా ఈ నెల 17న ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలు జరగ్గా.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు పతకాలు సాధించి శభాష్ అనిపించారు. 77 కేజీల విభాగంలో డి.హేమశ్రీ (బూరవెల్లి– డిగ్రీ ఫైనలియర్) బంగారు పతకం, 63 కేజీల విభాగంలో కొత్తకోట హాసిని (శ్రీకాకుళం–ఇంటర్ సెకెండియర్) కాంస్య పతకం, 77 కేజీల విభాగంలో టి.కావ్య (ఆడవరం –డిగ్రీ ఫస్టియర్) రజత పతకం సాధించి సత్తాచాటారు. టోర్నీ ముగించుకుని జిల్లా డీఎస్‌ఏ కార్యాలయానికి మంగళవారం వచ్చిన క్రీడాకారిణులను డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు అభినందించారు. ప్రతిష్టాత్మక పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. వీరిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న డీఎస్‌ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ అప్పన్నను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ వెయిట్‌లిఫ్టింగ్ కార్యదర్శి మధుసూదనరావు, కోచ్ ఇప్పిలి అప్పన్న, సిబ్బంది పాల్గొన్నారు.

• పొలం పనుల్లో బిజీబిజీ



నైరాలో వరినాట్లు



రాగోలులో పూర్తయిన దమ్ములు



తండేవలసలో ఉభాలుకు సిద్ధంగా పొలాలు

వరుణుడు కాస్త కరుణించడంతో రైతన్నలు పొలం బాట పట్టారు. వెదలు, వరినాట్లు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలో ఈ ఏడాది సుమారు 14వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కాలువల ద్వారా కూడా సాగునీరు వస్తుండటంతో వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమవుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్